నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 మహబూబ్‌నగర్, శుక్రవారం 18 అక్టోబర్ 2024 MAHABUBNAGAR NARAYANPET

## పత్తిరైతుల పరేషాన్


పత్తి కొనుగోలు కేంద్రం వద్ద క్యూలో ఉన్న వాహనాలు

నారాయణపేట టౌన్, అక్టోబర్ 17 : జిల్లాలో పత్తి రైతులు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పత్తి పంట కోతలు ప్రారంభమైనా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు తాము పండించిన పత్తిని మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. మిల్లర్లు పత్తి పంటకు తేమ శాతం ఎక్కువ ఉందని కారణం చూపుతూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ.7వేల లోపు పలుకుతుందని, మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలు ఏర్పాటు చేస్తే తేమ శాతం ఉన్న రైతులకు మేలు చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

**1.52లక్షల ఎకరాల్లో సాగు..**

జిల్లాలో మొత్తం లక్షా 52వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. జూన్, జూలైలో మోస్తారు వర్షాలు కురిసినా ఆగస్టు తర్వాత కురిసిన అకాల వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నది. దీంతో పత్తి దిగుబడి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తం 9 లక్షల 90వేల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారుల అంచనా వేస్తున్నారు.

**ఆరు కేంద్రాల ఏర్పాటు..**

జిల్లాలో నోటిఫైడ్ చేసిన మొత్తం 6 మిల్లులలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. క్వింటాకు రూ. 7,521 మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 8నుంచి 12శాతంలోపు తేమ శాతం ఉండాలని నిర్దేశించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తిలో తేమ శాతం పెరిగిందని, దీంతో ధర తక్కువ పలుకుతుండి రైతులు వాపోతున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి తమకు గిట్టుబాటు ధర వచ్చేలా, కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చెల్లింపులు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


బలిజపల్లిలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## అసమానతలులేని సమాజాన్ని నిర్మించాలి

- వాల్మీకి మహర్షి జయంతిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- రాముడి గొప్పదనాన్ని చాటిన మహనీయుడు : ఎమ్మెల్యే విజయుడు

ఖిల్లాఘణపురం/పెద్దమందడి, అక్టోబర్ 17 : రామాయణ మహాకావ్యాన్ని రచించిన జ్ఞాననిధి వాల్మీకి మహర్షి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఖిల్లాఘణపురం మండలం షాపూర్‌లో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అలాగే పెద్దమందడి మండలంలోని బలిజపల్లిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి వేటగాడిగా జీవితాన్ని ప్రారంభించి ప్రేమ ఆప్యాయతలను సమాజానికి పంచి రామాయణ మహాకావ్యాన్ని అందించిన తపస్వి అని కొనియాడారు. వాల్మీకి జీవితం ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో ముందుకు పయనించి అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని సూచించారు.

### వాల్మీకి జీవితం ఆదర్శనీయం

అయిజ, అక్టోబర్ 17 : వాల్మీకి బోయల ఆరాధ్య దైవం, ఆదికవి మహర్షి వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శనీయమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం పట్టణం లోని పాత బస్టాండ్ సమీపం లోని మహర్షి వాల్మీకి ఆలయంలో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాముడి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు మహర్షి వాల్మీకి అన్నారు. మనిషిలో ప్రవర్తన మారితే మహర్షి కాగలరనడానికి వాల్మీకి నిదర్శనమన్నారు. రామాయణ కావ్య రచనతో వాల్మీకి చరిత్రలో గొప్ప ఆదికవిగా ప్రసిద్ధి పొందాడన్నారు. అలాగే అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.


అయిజ : వాల్మీకి మహర్షి పూజలో పాల్గొన్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## సీతాఫలం మొక్కలు విరివిగా నాటాలి

- ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజ

నవాబ్‌పేట, అక్టోబర్ 17 : సీతాఫలాల మొక్కలను విరివిగా నాటి భవిష్యత్‌లో సీతాఫలాల దిగుబడి బాగా పెంచాలని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ నీరజ పేర్కొన్నారు. మండలం లోని పోమాల శివారులో రైతు డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీతాఫల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిట్ నిర్వాహకులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. సీతాఫల్ గుజ్జు తీసేటప్పుడు రంగు మారకుండా చూడాలన్నారు. ఉద్యానవన విశ్వవిద్యాలయం ద్వారా సీతాఫలాల గుజ్జుపై మరిన్ని పరిశోధనలు జరిపి మార్కెటింగ్ పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మారుమూల పోమాలలో సీతాఫల్ యూనిట్‌ను నిర్వహిస్తున్న రైతు డెవలప్‌మెంట్ సొసైటీని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు రాజశేఖర్, సైదయ్య, రైతు డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, రాములు, శ్రీరామ్ ఆంజనేయులు, గజేందర్ గౌడ్, రఘునందన్‌రెడ్డి, గణపతి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


పోమాలలో సీతాఫల్ యూనిట్ నిర్వాహకులతో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ నీరజ

## జూరాలలో మూడు గేట్ల ఎత్తివేత

గద్వాల/అయిజ, అక్టోబర్ 17 : ఎగువన ఉన్న నారాయణపూర్ డ్యాం ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో గురువారం జూరాల ప్రాజెక్టులకు 34,420 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు వదిలారు. 38,408 క్యూసెక్కులను వినియోగిస్తూ ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 61,744 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.316 టీఎంసీల నిల్వ ఉన్నది. కర్ణాటకలోని ఎగువన కురుస్తున్న వర్షాలతో టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 28,871, అవుట్‌ఫ్లో 28,607 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 101.500 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 36,443, అవుట్‌ఫ్లో 35,800 క్యూసెక్కులు ఉండగా.. ఆయకట్టుకు 643 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం ఆనకట్టలో 10.5 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 37,936, అవుట్‌ఫ్లో 43,820 క్యూసెక్కులుగా నమోదు కాగా.. ప్రస్తుతం 127.83 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 42,039, అవుట్‌ఫ్లో 39,733 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 37.22 టీఎంసీల నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.


తుంగభద్ర డ్యాం గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద నీరు

- నేటికీ ప్రారంభం కాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- భారీ వర్షాలతో తగ్గిన పత్తి పంట దిగుబడి
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో చిత్తవుతున్న రైతన్నలు
- తెల్లబంగారం నల్లగా మారిందటూ కొత్తరకం సాకులు
- క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5,500లోపే ధర..
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం శివారులోని జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించేందుకు తెచ్చిన రైతులు

# దళారుల దోపిడీ

**గతేడాది దిగుబడి లేక దిగాలు చెందిన రైతన్నకు ఈ ఏడాదైనా తెల్లబంగారం కాసులు కురిపిస్తుందనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. పత్తి పంట చేతికొచ్చి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాల ఊసేలేదు. భారీ వర్షాలతో ఆదిలోనే వేల ఎకరాల్లో పంట నష్టపోగా, ఇటీవల కురుస్తున్న వానలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అవకాశంగా దళారులు, వ్యాపారులు రైతులను నిలువునా ముంచుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం, పత్తి నల్లగా మారిందని.. తేమశాతం సాకుగా చూపుతూ రూ.4వేల నుంచి రూ.5,500కే ధరను నిర్ణయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. దీంతో రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.**

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : పత్తి రైతు దళారుల చేతుల్లో చిత్తవుతున్నాడు. భారీ వర్షాలతో ఇప్పటికే దెబ్బతిన్న రైతులు కష్టించి పండించిన కొద్ది పంటను కూడా అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులను ఆదుకోవడంపై దృష్టి సారించకపోవడంతో అమ్ముకొనేదుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కందనూలు జిల్లాలో ఈ సీజన్‌లో 2,18,395 ఎకరాల్లో పత్తి పంటను పండించగా, 2,62,068 మెట్రిక్ టన్నుల పంట చేతికి వచ్చే అవకాశమున్నది. గతంలో సీసీఐ కేంద్రాల ద్వారా రైతుల నుంచి పత్తిని సేకరించారు. అయితే ఈసారి ఇంకా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఈసారి వర్షాలు అధికంగా కురియడంతో జిల్లాలో 4 వేల ఎకరాలకుపైగా పంట నష్టం జరిగింది. అధికంగా కురిసిన వర్షాలతో పత్తి నల్లగా మారడం, మొక్కలు పెరగకుండా పోయాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందించలేదు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ఈనెల మొదటి వారం నుంచే చాలా మంది రైతులు పత్తిని ప్రైవేట్ వ్యాపారులు, ఫర్టిలైజర్ దుకాణదారులకు, మధ్య దళారుల ద్వారా విక్రయించుకుంటున్నారు. పత్తి నల్లగా మారిందని, తేమ కారణాలు చూపిస్తూ వ్యాపారులు క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు బొలేరోలు, లారీల్లో గ్రామాల్లోకి వచ్చి కొంటున్నారు. పొడవు పింజం పత్తి క్వింటాకు రూ.7,521 గరిష్ఠ మద్దతు ధరగా సర్కారు నిర్ణయించింది. మధ్యరకం పింజం పత్తి ధర రూ.7,121 వరకు ఉన్నది. అయితే, ప్రస్తుతం మార్కెట్లో మాత్రం రూ.5 వేల వరకే ధర ఉండడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

### త్వరలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



కేంద్ర ప్రభుత్వం త్వరలో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. అధికారులు సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత వస్తుంది. కేంద్రాల ఏర్పాటు ఖరారు అయ్యాక నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– రోషన్ దూబే, సీసీఐ అధికారి

## కొనుగోలు కేంద్రాలేవీ..?

- చేతికొచ్చిన పత్తిపంట
- ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- మధ్య దళారుల దోపిడీ

గద్వాల, అక్టోబర్ 17 : ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం కొన్నాళ్లకే బంద్ చేయడంతో దళారుల చేతిలో రైతులు నిలువునా మోసపోతున్నారు. పండిన పత్తిని నిల్వ చేసుకునే వీలులేక బహిరంగ మార్కెట్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. కేసీఆర్ సర్కారులో అన్నదాతల అవసరాలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరను ఇచ్చారు. కాగా, పత్తి చివరి కాపు కాస్తున్నా నేడు కాంగ్రెస్ సర్కారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. అసలే వర్షాలకు దిగుబడి తగ్గి నిట్టూరుస్తున్న వారికి కొనుగోలు కేంద్రాలు సైతం లేకపోవడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉన్న అలంపూర్‌లోని సిద్ధి వినాయక కాటన్‌మిల్లు

### ధర భారీగా తగ్గింది..



గతేడాదితో పోలిస్తే ఈసారి భారీగా ధరలు పడిపోయాయి. గత సంవత్సరం బహిరంగ మార్కెట్‌లో క్వింటాకు రూ.7వేలకు పైగా ధర పలుకగా, నేడు రూ.5వేల వరకే మధ్య దళారులు కొనుగోలు చేస్తున్నారు. వర్షాల కారణంగా నేను ఇప్పటికే 75శాతం పత్తిని అమ్మేశాను. ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదు.

– సుధాకర్, రైతు, బుక్కాపురం, అలంపూర్ మండలం

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రైతులకు పంట మొదటి దశ చేతికందే సమయంలోనే ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పత్తి రెండు, మూడు సార్లు తీశాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. అప్పటికే ఉన్న పత్తి దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. అలాగే మద్దతు ధర కేటాయించాలి.

–ఈదన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, జోగుళాంబ గద్వాల

### త్వరలో ప్రారంభిస్తాం..

సీసీఐ ఆధ్వర్యంలో ఉండవల్లి మండలంలోని సిద్ధి వినాయక కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. నిబంధనల మేరకు గరిష్ఠ మద్దతు ధర క్వింటాకు తేమ శాతాన్ని బట్టి రూ.7,121 నుంచి రూ.7,521ల వరకు ఉంటుంది. గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.250 ధర పెరిగింది. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కేంద్రాల్లో పత్తిని విక్రయించుకోవాలి.

– పుష్పమ్మ, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి, జోగుళాంబ గద్వాల

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

- ఫార్మసీ కళాశాలలు బంద్


మహబూబ్‌నగర్, అక్టోబర్ 17 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫార్మసీ కళాశాలలను బంద్ చేసి సమ్మె నిర్వహిస్తున్నట్లు ఫార్మసీ కళాశాలల విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని సరోజిని రాములమ్మ ఫార్మసీ విద్యార్థులు కళాశాల ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బాలరాజు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్‌ను కాపాడాలని కోరారు.


ఫార్మసీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

### నల్లమలలో వ్యక్తి అదృశ్యం

అమ్రాబాద్, అక్టోబర్ 17 : అమ్రాబాద్ మండలం శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో మన్ననూర్‌గ్రామ సమీపం లోని నల్లమల అడవిలో యాదయ్య మూడు రోజుల కిందట అదృశ్యమయ్యాడని సీఐ శంకర్‌నాయక్ గురువారం తెలిపారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరపల్లికి చెందిన యాదయ్య ఈనెల 15న శ్రీశైలం వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడని, మూడు రోజులైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. గాలింపు చేపట్టగా, మన్ననూరుకు మూడు కిలో మీటర్ల దూరంలో యాదయ్యకు చెందిన బైక్, బ్యాగు, హెల్మెట్, ఫోన్ బుధవారం రాత్రి లభ్యమయ్యాయన్నారు. ఈనెల 15న తన స్నేహితులతో కలిసి శ్రీశైలం దైవదర్శనానికి వెళ్తున్నానని భార్యకు ఫోన్ ద్వారా యాదయ్య చెప్పాడని, కొంత సమయానికే నేను ఒక్కడినే శ్రీశైలం వెళ్తున్నానని ఫోన్‌లో సందేశం పెట్టాడని తెలిపారు. యాదయ్య ఫోన్ కలవకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## మధురం.. జలపాతం



అచ్చంపేట రూరల్, అక్టోబర్ 17 : శ్రీశైల ఉత్తర ద్వారంగా బాసిల్లుతున్న శ్రీ ఉమా మహేశ్వరంలో ఇటీవల కురిసిన వర్షానికి కొండల పైనుంచి జాలువారుతున్న జలపాతం భక్తులను కనువిందు చేస్తుంది. గురువారం కురిసిన వర్షానికి భక్తుల తాకిడి పెరిగింది. జలపాతం కింద చేరి జలకాలాడుతున్నారు. సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందునా భక్తులు, పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.


ఉమామహేశ్వరంలో కనువిందు చేస్తున్న జలపాతం

